త్రిష రికార్డు శతకం

రికార్డుల దుమ్ముదులిపిన తెలంగాణ అమ్మాయి

స్కాట్లాండ్‌పై భారత్ ఘన విజయం

కౌలాలంపూర్: గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష.. మలేషియాలో జరుగుతున్న అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన సూపర్ సిక్స్ పోరులో త్రిష (59 బంతుల్లో 110 నాటౌట్, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) 53 బంతుల్లోనే శతకం బాది ఈ టోర్నీలో మొట్టమొదటి సెంచరీ చేసిన క్రికెటర్‌గా తన పేరును రికార్డుల పుస్తకాలలో సువర్ణాక్షరాలతో లిఖించుకుంది. త్రిషతో పాటు మరో ఓపెనర్ కమిలిని (42 బంతుల్లో 51, 9 ఫోర్లు) మెరవడంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం ఛేదనలో భారత బౌలర్ల ధాటికి స్కాట్లాండ్.. 14 ఓవర్లలోనే 58 పరుగులకు చాపచుట్టేయడంతో టీమ్‌ఇండియా 150 పరుగుల తేడాతో భారీ విజయం సాధించి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. లెఫ్టార్మ్ స్పిన్నర్లు అయూషి శుక్లా (4/8), వైష్ణవి శర్మ (3/5) ప్రత్యర్థి బ్యాటర్లను క్రీజులో నిలవనీయలేదు. బ్యాటింగ్‌లో దుమ్మురేపిన త్రిష.. (3/6) బంతితోనూ మెరిసి ఆల్‌రౌండ్ షోతో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' సొంతం చేసుకుంది. ఈనెల 31న జరిగే తొలి సెమీస్‌లో భారత్.. ఇంగ్లండ్‌తో తలపడుతుంది. రెండో సెమీస్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా అమీతుమీ తేల్చుకోనున్నాయి.

త్రిష అదుర్స్:

ఈ టోర్నీలో ఆల్‌రౌండ్ షోతో రాణిస్తున్న త్రిష.. గత రెండు మ్యాచ్‌లలో 40+ స్కోర్లతో రాణించింది. అయితే ప్రత్యర్థి జట్లు కనీసం పోరాడే స్కోరు (ఇప్పటిదాకా ఈ టోర్నీలో భారత్‌తో తలపడిన ప్రత్యర్థి జట్లేవీ కనీసం 70 పరుగుల టార్గెట్‌ను కూడా నిర్దేశించలేదు)ను కూడా మన ఎదుట నిలపకపోవడంతో ఆమె భారీ స్కోర్లు చేయాల్సిన అవసరం లేకపోయింది. కానీ స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో టీమ్‌ఇండియా మొదట బ్యాటింగ్ చేయడం త్రిషకు కలిసొచ్చింది. ఆరంభం నుంచే మైదానంలో బౌండరీల వర్షం కురిపించిన త్రిష.. 29 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసింది. మరో ఎండ్‌లో కమిలిని కూడా దూకుడగా ఆడటంతో భారత స్కోరు రాకెట్ వేగాన్ని తలపించింది. తొలి వికెట్‌కు ఓపెనింగ్ జోడీ 13.3 ఓవర్లలో 147 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని జతచేసింది. ఆ తర్వాత కమిలిని నిష్క్రమించినా త్రిష దూకుడు తగ్గలేదు. మరో రెండు ఓవర్లు ఉండగానే త్రిష శతకం పూర్తవడంతో భారత్ ఈ టోర్నీ చరిత్రలో రికార్డు స్కోరు చేసింది.

శభాష్ త్రిష

ప్రతిష్ఠాత్మక మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలో తొలి సెంచరీ సాధించి సత్తాచాటిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు హృదయపూర్వక అభినందనలు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాకు చెందిన త్రిష..భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించడం మనందరికీ గర్వకారణం. మున్ముందు మరింత రాణించి తెలంగాణ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలువాలి.

-సీఎం రేవంత్‌రెడ్డి

త్రిష ప్రదర్శన గర్వకారణం. మహిళల టీ20 ప్రపంచకప్‌లో సెంచరీ చేసిన తొలి ప్లేయర్‌గా నిలిచిన త్రిషకు ప్రత్యేక అభినందనలు. 110 పరుగుల సూపర్ సెంచరీతోపాటు మూడు వికెట్లు తీయడం చిరస్మరణీయ ప్రదర్శన **- మాజీ మంత్రి హరీశ్‌రావు**

అక్షిత పసిడి జోరు

- రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ టోర్నీ

యాచారం: గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం జరిగిన 7వ రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ టోర్నీలో యాచారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అక్షిత సత్తాచాటింది. ఒకటి కాదు రెండు కాదు మూడు బంగారు పతకాలు సొంతం చేసుకుని శభాష్ అనిపించుకుంది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం సాకలోనిపల్లి గ్రామానికి చెందిన అక్షిత యాచారం ప్రభుత్వ హాస్టల్‌లో వుంటూ 10వ తరగతి చదువుతున్నది. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన 7వ రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ 100మీ. 200మీ రేసుల్లో స్వర్ణాలు సాధించిన అక్షిత..లాంగ్‌జంప్‌లోనూ మరో పసిడి దక్కించుకుంది. ఈ అద్భుత ప్రదర్శన ద్వారా చెన్నై వేదికగా ఫిబ్రవరిలో జరిగే జాతీయ పారా అథ్లెటిక్స్ టోర్నీకి అక్షిత ఎంపికైంది.

భారత్‌కు బ్రేక్

రాజ్‌కోట్ టీ20లో ఇంగ్లండ్ బోణీ • వరుణ్‌కు ఐదు వికెట్లు • టీమ్‌ఇండియా బ్యాటింగ్ తడబాటు

రాజ్‌కోట్: పొట్టి ఫార్మాట్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న యువ భారత జోరుకు బ్రేక్ పడింది. స్వదేశంలో ఇంగ్లండ్‌పై వరుసగా రెండు మ్యాచ్‌లు నెగ్గి మూడోదీ గెలిచి సిరీస్‌ను పట్టేయాలన్న టీమ్‌ఇండియా ఆశలపై పర్యాటక జట్టు నీళ్లు చల్లింది. రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో టీ20లో భారత్‌ను 26 పరుగుల తేడాతో ఓడించింది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. 20 ఓవర్లకు 171/9 స్కోరు చేసింది. బెన్ డకెట్ (28 బంతుల్లో 51, 7 ఫోర్లు, 2 సిక్సర్లు), లివింగ్‌స్టన్ (24 బంతుల్లో 43, 1 ఫోర్, 5 సిక్సర్లు) రాణించారు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (5/24) తన కెరీర్‌లో రెండో ఫైఫర్‌తో విజృంభించి ఇంగ్లండ్‌ను కట్టడి చేసినా ఛేదనలో భారత్ తడబాటుకు గురైంది. 20 ఓవర్లలో 145/9 పరుగులకే పరిమితమైంది. హార్దిక్ పాండ్యా (35 బంతుల్లో 40, 1 ఫోర్, 2 సిక్సర్లు), అభిషేక్ శర్మ (24) మినహా మిగిలినవారు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయారు.

డకెట్ దూకుడు

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన ఇంగ్లండ్ ఆరంభ ఓవర్లలో ఆడిన ఆటను చూస్తే ఆ జట్టు అవలీలగా 200 దాటుతుందేమో అనిపించింది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఫిల్ సాల్ట్ (5) నిరాశపరిచినా మరో ఓపెనర్ బెన్ డకెట్ మాత్రం దూకుడుగా ఆడాడు. షమీ 3వ ఓవర్‌లో కీపర్ మీదుగా భారీ సిక్సర్ కొట్టిన అతడు.. హార్దిక్ 4వ ఓవర్లో హ్యాట్రిక్ బౌండరీలు బాదాడు. ఆ తర్వాత వాషింగ్టన్ ఓవర్లో 4, 4,6తో 15 రన్స్ రాబట్టాడు.

వరుణ్ మాయ

డకెట్, బట్లర్ దూకుడుతో జోరు మీదున్న ఇంగ్లండ్ వరుణ్ రాకతో తడబడింది. 9వ ఓవర్ ఆఖరి బంతికి బట్లర్.. శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అతడు ఔట్ అవడానికి ముందు 83/1గా ఉన్న ఇంగ్లండ్.. ఆ తర్వాత క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో 15 ఓవర్లకు 115/6గా నిలిచింది. 26 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసిన డకెట్‌ను అక్షర్ 9వ ఓవర్లో చివరి బంతికి అతడిని పెవిలియన్‌కు పంపాడు. బ్రూక్ (8)ను బిష్ణోయ్ బౌల్డ్ చేయగా 14వ ఓవర్లో వరుణ్.. స్మిత్ (6), ఓవర్టన్ (0)ను వరుస బంతుల్లో ఔట్ చేసి ఇంగ్లీష్ జట్టును కోలుకోని దెబ్బకొట్టాడు. ఆఖర్లో లివింగ్‌స్టాన్.. బిష్ణోయ్ 17వ ఓవర్‌లో 3 భారీ సిక్సర్లు బాదినా ఆ తర్వాతి ఓవర్లోనే హార్దిక్ అతడిని ఔట్ చేశాడు.

ఒక్కరు కూడా..

లక్ష్య ఛేదనలో భారత్ ఆరంభం నుంచే తడబాటుకు గురైంది. ఈ సిరీస్‌లో షార్ట్ బంతులు ఆడలేక ఇబ్బందులు పడుతున్న శాంసన్ (3) మరోసారి అదే బలహీనతతో పెవిలియన్ చేరాడు. ఐదు బౌండరీలు బాదిన అభిషేక్.. కార్స్ 4వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయి ఆర్చర్‌కు క్యాచ్ ఇచ్చాడు. 6, 4తో తన ఇన్నింగ్స్‌ను ఆరంభించిన కెప్టెన్ సూర్య (14) మళ్లీ నిరాశపరిచాడు. భారత్ భారీ ఆశలు పెట్టుకున్న తిలక్ వర్మ (18)ను రషీద్ అద్భుత డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేయడంతో భారత్ కష్టాల్లో పడింది. వుడ్ 17వ ఓవర్లో 14 పరుగులు రాగా ఆర్చర్ 18వ ఓవర్లో 9 పరుగులే ఇచ్చి అక్షర్ వికెట్ తీశాడు. 19వ ఓవర్లో హార్దిక్ నిష్క్రమణతో భారత ఓటమి ఖరారైంది.

సంక్షిప్త స్కోర్లు:

ఇంగ్లండ్: 20 ఓవర్లలో 171/9 (డకెట్ 51, లివింగ్‌స్టాన్ 43, వరుణ్ 5/24, హార్దిక్ 2/33); **భారత్:** 20 ఓవర్లలో 145/9 (హార్దిక్ 40, అభిషేక్ 24, ఓవర్టన్ 3/24, కార్స్ 2/28)

బుమ్రా ది గ్రేట్

'మెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఈయర్' అవార్డు కైవసం

దుబాయ్: భారత పేస్ దళ నాయకుడు జస్‌ప్రీత్ బుమ్రాకు ఐసీసీ అవార్డుల పంట పండుతోంది. గత వారం రోజులుగా ఐసీసీ ప్రకటిస్తున్న పలు అవార్డులను సొంతం చేసుకున్న ఈ పేసుగుర్రం.. తాజాగా మరో ప్రతిష్టాత్మక అవార్డు అయిన 'మెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఈయర్ - 2024'నూ గెలుచుకున్నాడు. సర్ గార్‌ఫీల్డ్ సోబర్స్ పేరుమీద ఇచ్చే ఈ అవార్డును గెలిచిన తొలి భారత బౌలర్‌గా నిలిచాడు. గతంలో భారత్ నుంచి ద్రవిడ్ (2004), సచిన్(2010), అశ్విన్ (2016), కోహ్లీ (2017, 2018) ఈ ఘనత సాధించిన వారిలో ఉన్నారు. కాగా ఈ అవార్డు కోసం హెడ్ (ఆస్ట్రేలియా), బ్రూక్, రూట్ (ఇంగ్లండ్) పోటీపడ్డా గతేడాది తన బౌలింగ్‌తో టెస్టులతో పాటు పరిమిత ఓవర్లలోనూ నిలకడగా రాణించిన బుమ్రానే ఈ అవార్డు వరించింది.అత్యుత్తమ క్రికెటర్‌తో పాటు బుమ్రాకు 'మెన్స్ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఈయర్' అవార్డూ, ఐసీసీ ప్రకటించిన అత్యుత్తమ టెస్టు జట్టులోనూ చోటు దక్కింది.

శ్రీనిధి, నమ్దారీ ఎఫ్‌సీ పోరు డ్రా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ మళ్లీ పుంజుకుంది. మంగళవారం టేబుల్ టాపర్ నమ్దారీ ఎఫ్‌సీతో జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ 1-1తో డ్రాగా ముగించింది. మ్యాచ్‌లో ఇరు జట్లు హోరీహోరీగా తలపడ్డాయి. మ్యాచ్ 33వ నిమిషంలో ఎలీ సాబియా గోల్‌తో నమ్దారీ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ద్వితీయార్ధం మొదలైన తొలి నిమిషానికే దక్కన్ ఎఫ్‌సీ ప్లేయర్ విలియమ్ ఒలీవిరా గోల్‌తో స్కోరు 1-1తో సమమైంది. మరో గోల్ కోసం రెండు జట్లు కడదాకా ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది.

అట్టహాసంగా నేషనల్ గేమ్స్

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ వేదికగా 38వ నేషనల్ గేమ్స్‌కు మంగళవారం అట్టహాసంగా తెరలేచింది స్థానిక రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా ఆరంభ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రధాని నరేంద్రమోదీ నేషనల్ గేమ్స్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ నుంచి 212 మంది ప్లేయర్లు 23 క్రీడా విభాగాల్లో పోటీపడుతున్నారు. ధనుశ్ శ్రీకాంత్, చికిత తెలంగాణ ఫ్లాగ్ బేరర్స్‌గా వ్యవహరించారు.

త్రివిక్రమ్ చిత్రంలో కార్తికేయుడి పాత్రలో?

'పుష్ప-2' చిత్రంతో ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాశాడు అల్లు అర్జున్. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించబోతున్న తదుపరి సినిమాపై దేశవ్యాప్తంగా అభిమానుల్లో చర్చ జరుగుతున్నది. ముఖ్యంగా ఈ సినిమా కథాంశం ఎలా ఉండబోతుందనే విషయం ఆసక్తినిరేకెత్తిస్తున్నది. తాజా సమాచారం ప్రకారం సోషియో, మైథలాజికల్ జానర్‌లో దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని తెలిసింది. హిందూ ధర్మంలో యుద్ధం, విజయానికి ప్రతీకలా భావించే శివుడి తనయుడు కార్తికేయుడి పాత్రలో అల్లు అర్జున్ కనిపిస్తారని చెబుతున్నారు. భారతీయ పురాణాలను నేటి సాంఘిక అంశాలకు ముడిపెట్టి దర్శకుడు త్రివిక్రమ్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తున్నారని తెలిసింది. ప్రస్తుతం ఈ వార్త సోషల్‌మీడియాలో బాగా ప్రచారం అవుతున్నది. అయితే ఇందులో నిజానిజాలేమిటో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు చరుగ్గా జరుగుతున్నాయి. ఏప్రిల్‌లో సినిమాను సెట్స్‌మీదకు తీసుకొస్తారని సమాచారం.

రూల్స్ పాటించాల్సిందే!

చిత్రం

అగ్ర దర్శకుడు రాజమౌళి తన సినిమాను ఓ యజ్ఞంలా భావిస్తారు. కొబ్బరికాయ కొట్టింది మొదలు గుమ్మడికాయ కొట్టే వరకు ప్రతీ విషయంలో అత్యంత శ్రద్ధతో వ్యవహరిస్తారు. ముఖ్యంగా సినిమాకు సంబంధించిన సమాచారంతో పాటు ఆర్టిస్టుల లుక్స్ తాలూకు ఫొటోలు బయటకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. ప్రస్తుతం ఆయన మహేష్‌బాబుతో పాన్ వరల్డ్ అడ్వెంచర్ మూవీని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా విషయంలో ఎలాంటి లీక్‌లకు ఆస్కారం లేకుండా రాజమౌళి టీమ్ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నదట. అందులో భాగంగా నటీనటులు, సాంకేతిక నిపుణులతో నాన్-డిస్‌క్లోజ్ అగ్రిమెంట్ చేసుకున్నారని పలు ఆంగ్ల పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. చిత్ర బృందం అనుమతి లేకుండా సినిమా తాలూకు ఎలాంటి సమాచారాన్ని, విశేషాలను బయటకు వెల్లడించొద్దని, ఒకవేళ ఎవరైనా అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అగ్రిమెంట్‌లో పేర్కొన్నారట. షూటింగ్ లొకేషన్‌లో ఫోన్లకు కూడా అనుమతి ఉండదని తెలిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో తీర్చిదిద్దిన ప్రత్యేకమైన సెట్స్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది. ఈ సినిమాలో బాలీవుడ్ అగ్ర నటి ప్రియాంకచోప్రా కథానాయికగా నటిస్తున్నదని ప్రచారం జరుగుతున్నది. అయితే ఈ విషయాన్ని ఇప్పటివరకు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించలేదు.

ఇక రాజులమ్మ జాతరే..

'గత ఏడాదిన్నర నుంచి నా జీవితంలో నిజమైన తండేల్ అల్లు అరవింద్‌గారు. ఆయన లేకుండా మరో సినిమా చేయగలనా అనే ఫీలింగ్ వచ్చింది. ఈ సినిమా విషయంలో ఆయనో మార్గదర్శిలా నిలిచారు' అన్నారు నాగచైతన్య. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సాయిపల్లవి కథానాయిక. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించారు. ఫిబ్రవరి 7న విడుదలకానుంది. మంగళవారం విశాఖపట్నంలో ట్రైలర్‌ను విడుదల చేశారు. మత్స్యకారుల జీవితం నేపథ్యంలో ప్రేమ, దేశభక్తి ప్రధానంగా ట్రైలర్ ఆకట్టుకుంది. 'మా యాసను ఎటకారం చేస్తే రాజులమ్మ జాతరే' అంటూ నాగచైతన్య చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. నాగచైతన్య మాట్లాడుతూ 'నాకు వైజాగ్ అంటే చాలా ఇష్టం. అందుకే ఇక్కడి అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నా. ఇక్కడ సినిమాకు కలెక్షన్స్ షేక్ అవ్వాలి. ఫిబ్రవరి 7న థియేటర్లో రాజులమ్మ జాతరే' అన్నారు. ఈ సినిమాలో నాగచైతన్య కెరీర్ బెస్ట్ పర్‌ఫార్మెన్స్ కనబరిచారని, కొన్ని సన్నివేశాలు హృదయాన్ని కదిలిస్తాయని నిర్మాత అల్లు అరవింద్ చెప్పారు. ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతాన్నందించారు.

కరీంనగర్ నేపథ్యంలో 'బాపు'

బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'బాపు'. 'ఏ ఫాదర్స్ సూసైడ్ స్టోరీ' ఉపశీర్షిక. ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ ప్రధాన పాత్రల్లో నటించారు. దయా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కించారు. రాజు, సి.హెచ్. భానుప్రసాద్ రెడ్డి నిర్మాతలు. ఫిబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకురానుంది. మధుర ఆడియో ద్వారా ఈ సినిమా విడుదలకానుంది. మంగళవారం టీజర్‌ను అగ్ర కథానాయిక రష్మిక మందన్న సోషల్‌మీడియా వేదికగా విడుదల చేశారు. టీజర్ లాంచ్‌కు యువ హీరో విశ్వక్‌సేన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పల్లెటూళ్లలో మానవ సంబంధాలను, డబ్బు అవసరం వచ్చినప్పుడు ఎలా ఆలోచిస్తారనే విషయాలను ఈ సినిమాలో ఆసక్తికరంగా చూపించామని నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఎలాంటి క్యారవాన్ సౌకర్యాన్ని ఉపయోగించుకోకుండా, కరీంనగర్‌లోని ఓ పల్లెటూరిలో ఈ సినిమా షూటింగ్ జరిపామని, వినూత్న కథతో ఆకట్టుకుంటుందని బ్రహ్మాజీ పేర్కొన్నారు. కొత్త కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమాను ఆదరించాలని దర్శకుడు దయ కోరారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

నేటితరం ప్రేమకథ

ఆకాష్ మురళి, అదితిశంకర్ జంటగా 'పంజా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ప్రేమిస్తావా'. తమిళంలో 'నేసిప్పాయా' పేరుతో విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీమూవీ మేకర్స్ ఈ నెల 30న తెలుగులో విడుదల చేస్తున్నది. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. నేటితరంలో యువతీయువకుల మధ్య ప్రేమ సంబంధాలు ఎలా ఉన్నాయనే అంశాన్ని ఈ సినిమాలో చూపించామని, యువన్ శంకర్ రాజా సంగీతం హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు విష్ణువర్ధన్ తెలిపారు. నేటి యూత్‌కు కనెక్ట్ అయ్యే అన్ని అంశాలున్న చిత్రమిదని మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూటర్ శశి పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కావడం ఆనందంగా ఉందని హీరో ఆకాష్ మురళి తెలిపారు.

నాన్‌స్టాప్‌గా నవ్విస్తుంది

'అన్నిరకాల వాణిజ్య హంగులు కలబోసిన సినిమా ఇది. నా క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుంది. విశాల్ నాకు మంచి మిత్రుడు. ఈ సినిమా కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు. తమిళంలో పెద్ద విజయం సాధించిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకుల్ని కూడా ఆకట్టుకుంటుందనే నమ్మకం' ఉంది అని చెప్పింది అంజలి. ఆమె కథానాయికగా విశాల్ సరసన నటించిన తమిళ చిత్రం 'మదగజ రాజా'. సుందర్ సి దర్శకుడు. ఈ చిత్రాన్ని సత్యకృష్ణ ప్రొడక్షన్స్ ఈ నెల 31న తెలుగులో విడుదల చేస్తున్నది. వరలక్ష్మి శరత్‌కుమార్ మరో నాయికగా నటించింది. సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి శరత్‌కుమార్ మాట్లాడుతూ 'నాయికగా నా తొలి కమర్షియల్ సినిమా ఇది. విశాల్ యాక్షన్, సంతానం కామెడీ హైలైట్‌గా నిలుస్తాయి. నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్‌గా తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అని తెలిపింది. తమిళంలో బ్లాక్‌బస్టర్ హిట్ అయిందని, ఇక్కడ కూడా అదే ఫలితం వస్తుందన్న నమ్మకంతో ఉన్నామని నిర్మాత జెమిని కిరణ్ తెలిపారు. ఈ చిత్రానికి విజయ్ ఆంటోని సంగీతాన్నందించారు.

చెప్పకనే చెప్పింది..!

అగ్ర తారలు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న రిలేషన్‌లో ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలొస్తున్నాయి. అయితే తామిద్దరం మంచి మిత్రులం మాత్రమేనని ఈ జంట అనేక సందర్భాల్లో స్పష్టం చేశారు. అయినా వారిద్దరి రిలేషన్‌కు సంబంధించిన వార్తలు మాత్రం ఆగడం లేదు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రష్మిక మందన్న తన భాగస్వామి గురించి మాట్లాడిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నానని కన్‌ఫర్మ్ చేసిన రష్మిక మందన్న.. భాగస్వామి పేరును మాత్రం చెప్పడానికి ఇష్టపడలేదు. ఇదే ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది రష్మిక మందన్న. ఈ ప్రపంచంలో తన ఇల్లు అత్యంత అనందకరమైన ప్రదేశమని చెప్పింది. 'సక్సెస్, ఫెయిల్యూర్స్ వస్తూపోతుంటాయి. కానీ ఇల్లు ఇచ్చే ఆనందం శాశ్వతం. నేను ఎప్పటికీ ఓ బాధ్యత కలిగిన కుమార్తెను, సోదరిని, భాగస్వామిని కూడా. వీరి చుట్టూ కలబోసిన జీవితానికి నేను ఎంతో విలువిస్తాను' అని రష్మిక మందన్న చెప్పింది. ఈ ఇంటర్వ్యూలో తన భాగస్వామి గురించి రష్మిక మందన్న ప్రత్యేకంగా ప్రస్తావించడంతో తన ప్రేమ వ్యవహారం గురించి చెప్పకనే చెప్పిందని సోషల్‌మీడియాలో నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

అమ్మ కోసం ఎంతవరకైనా..

అమ్మ రాజశేఖర్ దర్శకత్వంలో ఆయన తనయుడు రాగిన్ రాజ్ హీరోగా నటించిన చిత్రం 'తల'. పి.శ్రీనివాస్‌గౌడ్ నిర్మాత. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ట్రైలర్‌ను యువ హీరోలు సోహైల్, అశ్విన్ విడుదల చేశారు. అమ్మను అమితంగా ప్రేమించే యువకుడి కథగా యాక్షన్ అంశాలతో ట్రైలర్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ.. రెండేళ్లు ఆలోచించి కొత్త పాయింట్‌తో ఈ కథ సిద్ధం చేశానని, యాక్షన్ అంశాలతో ఆకట్టుకుంటుందని, రాగిన్ రాజ్ మంచి పర్‌ఫార్మెన్స్ కనబరిచాడని అన్నారు. హీరోగా తనకు శుభారంభాన్నిచ్చే సినిమా అవుతుందని హీరో అమ్మ రాగిన్ రాజ్ నమ్మకం వ్యక్తం చేశాడు. అంకిత్ నస్కర్, రోహిత్, ఏస్తేర్, సత్యం రాజేష్, అజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ధర్మతేజ, అస్లాం కేఈ, దర్శకత్వం: అమ్మ రాజశేఖర్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.